ఏఎస్‌ఐ శ్యామలకు అంబేడ్కర్ విశిష్ట సేవా జాతీయ అవార్డు


అవార్డు అందుకుంటున్న శ్యామల

సనత్‌నగర్: బేగంపేట సింధికాలనీకి చెందిన ఏఎస్‌ఐ డాక్టర్ వి.శ్యామలకు డాక్టర్ అంబేడ్కర్ విశిష్ట సేవా జాతీయ అవార్డు వరించింది. భారతీయ దళిత్ సాహిత్య అకాడమీ (బీడీఎస్‌ఏ) ఆధ్వర్యంలో ఈ నెల 10న ఢిల్లీ రింగ్‌రోడ్డులోని జరోడా గ్రామంలోని పంచశీల్ ఆశ్రమంలో జరిగిన విశిష్ట సేవా అవార్డుల ప్రదానోత్సవంలో అతిథుల చేతుల మీదుగా ఆమెకు ఈ అవార్డును ప్రదానం చేశారు. శ్యామల చేసిన సామాజిక సేవా కార్యక్రమాలకు బీడీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్పీ సుమనాక్షర ఆమెను ఎంపిక చేసి అవార్డును అందించారు. ఈ సందర్భంగా శ్యామల మాట్లాడుతూ.. తనకు లభించిన ఈ అవార్డును తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు.

కార్మిక సంక్షేమ పథకాలపై అవగాహన


మాట్లాడుతున్న అప్సా ప్రతినిధులు

లాలాపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై బుధవారం వినోభానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అప్సా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అప్సా కోఆర్డినేటర్ మంజుల మాట్లాడుతూ.. అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులందరూ ఈ శ్రమ్ కార్డులు తీసుకోవాలని సూచించారు. దీంతో పాటుగా లేబర్ డిపార్టుమెంట్‌లో పేరు నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక భీమా, పెన్షన్ సదుపాయం, పిల్లల చదువులు, వివాహాలకు ఆర్థిక సహాయం వంటి లబ్ధి పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ రోజారాణి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

లాలాపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్



లాలాపేట: లాలాపేట ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా మడిపడగ శ్రీనివాస్ గుప్తా ఎన్నికయ్యారు. ఈ మేరకు సంఘం శాశ్వత గౌరవ అధ్యక్షులు నేతి రాములు గుప్తా ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో శ్రీనివాస్ గెలుపొందారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా పందిరి సాంబశివరావు, కోశాధికారి ఎనిశెట్టి భాస్కర్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. సంఘంలో ప్రస్తుతం 350 మంది సభ్యులుగా ఉన్నారని ఈ సంఘం ద్వారా నిరుపేద వైశ్యులకు వివాహాలు జరిపించడం, అన్నదాన కార్యక్రమాలు, పేద ప్రజలకు సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఈ నెల 31న లాలాపేటలోని నఫీజ్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

రంగనాథరావుకు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (ఇన్ఫర్మాటిక్స్) విభాగం నుంచి బల్లారపు.రంగనాథరావు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ పట్టా అందుకున్నారు. ప్రొ.సుజాత పర్యవేక్షణలో ఆన్ ఎఫీసీఎన్ట్ అండ్ సెక్యూర్డ్ డేటా స్టోరేజ్ అండ్ ఇంటిగ్రిటీ చెకింగ్ ఫర్ పబ్లిక్ క్లౌడ్స్ యూజింగ్ మోడిఫైడ్ ఎల్లిప్టిక్ కర్వ్ క్రిప్టోగ్రఫీ (ఎంఈసీసీ) అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ డిగ్రీ లభించింది. రంగనాథరావు ఓయూ పరిధిలోని సికింద్రాబాద్ పీజీ కాలేజీలో అధ్యాపకులుగా విధులు నిర్వర్తిస్తున్నారు.

హుండీ ఆదాయం రూ.33,27,550


ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

రాంగోపాల్‌పేట్: ఉజ్జయినీ మహాకాళీ దేవస్థానం హుండీని లెక్కించగా 73 రోజులకు రూ.33,27,550 ఆదాయం సమకూరినట్లు ఈఓ మనోహర్‌రెడ్డి తెలిపారు. బుధవారం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, దేవస్థానం ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ రామేశ్వర్ సమక్షంలో ఆదాయాన్ని లెక్కించారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.19, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 45, బెండకాయ 55, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 55, పందిరి బీర 55, క్యాబేజీ 15, క్యారెట్ 33, దొండ 35, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 45, కీర 28, దోసకాయ 23, బీట్‌రూట్ 31, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 23, చామగడ్డ 45, మొరంగడ్డ 23, కందగడ్డ 50, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4-6, ముల్లంగి 4-6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

నేడు వేమన ఆంధ్ర భాషానిలయం దశాబ్ది ఉత్సవాలు

కవాడిగూడ: ఏవీ కళాశాల గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో గురువారం శ్రీ వేమన ఆంధ్ర భాషా నిలయం దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఏవీ కళాశాల పీజీ సెంటర్ సంచాలకులు డాక్టర్ ఎం.భగవంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్.రాజలింగం తెలిపారు. వేమన ఆంధ్రభాషా నిలయం దశాబ్ది ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా ఉస్మానియా యూనివర్శిటీ తెలుగు విభాగం పూర్వ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, విశిష్ట అతిథులుగా ఉస్మానియా యూనివర్శిటీ గ్రంథాలయాల శాఖ విశ్రాంత ఆచార్య ఎస్.లక్ష్మణ్‌రావు, ప్రత్యేక అతిథులుగా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ డాక్టర్ ఆయాచితం శ్రీధర్, డాక్టర్ ఎం. రాంచందర్, డాక్టర్ చెగోని రవికుమార్, ఏవీ కళాశాల కరస్పాండెంట్ ఎ.గౌతమి, ఏవీ కళాశాల గ్రంథ పాలకులు ఎం.రవీందర్, పి.ప్రతిభ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

'ఉచిత బస్సు ప్రయాణం'లో మార్పులు చేయాలి

కాచిగూడ: తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించారని, ఈ ఉచిత ప్రయాణంలో చాలా అనర్థాలు, నష్టాలు ఉన్నాయని, అందువల్ల హేతుబద్ధంగా ఈ ఉచిత ప్రయాణాన్ని సవరించాల్సిన అవసరం ఉందని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ అన్నారు. ఈ విషయంలో పలు సూచనలు చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రికి ఆయన బహిరంగ లేఖ రాశారు. అనంతరం బర్కత్‌పురలోని ధర్మసమాజ్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..ఆర్టీసీ బస్సుల్లో ఈ మహిళా ఉచిత ప్రయాణాన్ని.. తెల్ల రేషన్ కార్డు ఉన్న పేద మహిళలకు మాత్రమే ఉచిత ప్రయాణ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆటో డ్రైవర్లందరికి నెలకు రూ.3 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి


వివిధ శాఖల అధికారులతో సమావేశమైన తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశించారు. వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసంలో జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ తదితర శాఖలకు చెందిన అధికారులు బుధవారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాటర్‌వర్క్స్, జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గ పరిధిలోని హమాలీబస్తీ, రామస్వామి కాంపౌండ్, సజన్‌లాల్ స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో సీవరేజీ, మంచినీటి పైప్ లైన్ పనులు పూర్తి కాలేదని, మరికొన్ని చోట్ల ఈ పనులు పూర్తికాకపోవడంతో రోడ్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయన్నారు. బేగంపేటలోని ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో చేపట్టిన ముస్లిం గ్రేవ్‌యార్డు నిర్మాణ పనులను కూడా మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నూతనంగా మంజూరైన పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను కూడా త్వరగా పూర్తిచేయాలని సూచించారు. జీహెచ్ఎంసీ ఈఈ సుదర్శన్, వాటర్‌వర్క్స్ సీజీఎం ప్రభు, డీజీఎం శశాంక్, సురేష్, సంధ్యారాణి, డీఈ బ్రహ్మారెడ్డి, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ క్రిస్టోఫర్, డిప్యూటీ ఈఈ ఆంజనేయులు, ఏఈలు నవీన్, ఎలక్ట్రికల్ డీఈ శ్రీధర్, స్ట్రీట్‌లైట్స్ డీఈ ప్రసన్న, శానిటేషన్ డీఈ శ్రీనివాస్, ఏఈ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

అందరికీ అందుబాటులో ఉంటా..

ఎవరికి ఏ సమస్య వచ్చినా తాను నిరంతరం అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి మూడోసారి భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా బుధవారం పలువురు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నార్త్‌జోన్ జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, డీసీ శంకరయ్య, అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి ఆధ్వర్యంలో ఎస్ఆర్‌నగర్ రెసిడెంట్స్ అసోసియేషన్‌కు చెందిన సుధాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, వివేక్‌నాథ్, డేవిడ్, ఈడెన్ అపార్ట్‌మెంట్‌కు చెందిన మల్లన్న, నారాయణరాజు, లత, నాగలక్ష్మీ, ఉమలు ఎమ్మెల్యేను పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అదే విధంగా గాయత్రినగర్‌కు చెందిన వినోద్, శివ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌తో తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఉన్న ఫొటో ఫ్రేమ్‌ను అందజేశారు. బన్సీలాల్‌పేట డివిజన్ కృష్ణానగర్‌కాలనీ అధ్యక్షుడు రామచంద్రయ్య, సెక్రటరీ మురళి, ప్రకాష్, గుజ్జుల రమేష్, భాస్కర్, జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు రాములుయాదవ్, గుడిగే శ్రీనివాస్‌యాదవ్, చక్రధర్‌యాదవ్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు సన్మానం


ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను సత్కరిస్తున్న సంఘం సభ్యులు

బౌద్ధనగర్: సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించిన పద్మారావుగౌడ్‌ను బుధవారం వారాసిగూడ పద్మశాలి సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు బొమ్మ నరేంద్ర మాట్లాడుతూ.. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, అర్హులైన లబ్ధిదారులకు అందజేసిన సంక్షేమ పథకాల ద్వారానే పద్మారావుగౌడ్ మూడోసారి విజయం సాధించినట్లు పేర్కొన్నారు. ఇదే విధంగా మరింత మెరుగైన అభివృద్ధి చేస్తూ ప్రజల మనస్సులో ఎప్పటికీ పద్మారావుగౌడ్ చెరగని ముద్ర వేసుకుంటారన్నారు. అనంతరం సంఘం సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అల్లి గోవింద్, జనార్దన్, కల్లెపల్లి రాజు, బల్ల గీత, సుమలత, సుజాత, శ్రీధర్, సత్యనారాయణ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేత అంజయ్య మృతి

ఎమ్మెల్యే రూ. లక్ష ఆర్థిక సాయం

అడ్డగుట్ట: అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ వార్డు సభ్యుడు అంజయ్య మృతి చెందాడు. ఈ నెల 7 న రోడ్డు ప్రమాదంలో గాయపడిన అంజయ్య సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అంజయ్య అంతిమ యాత్రలో పాల్గొని భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. లక్ష ఆర్థిక సహాయం అందజేశారు.


సంతాపం ప్రకటిస్తున్న ఎమ్మెల్యే

ఈ-పెట్టీ కేసులో ముగ్గురికి జైలుశిక్ష

రాంగోపాల్‌పేట్: ఈ-పెట్టీ కేసులో ముగ్గురు నిందితులకు సికింద్రాబాద్ 6వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ శారదదేవి జైలు శిక్ష విధించినట్లు రాంగోపాల్‌పేట్ ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్ తెలిపారు. రసూల్‌పురకు చెందిన మహ్మద్ అక్బర్ (19) నల్లగుట్టలోని ఉర్దూ మీడియం ప్రభుత్వ పాఠశాలకు వచ్చి అక్కడికి వచ్చిన విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిపై ఈ-పెట్టీ కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచడంతో 3 రోజుల జైలు శిక్ష విధించారు. అలాగే నల్లగుట్టకు చెందిన మహేష్ (20), సయ్యద్ ముస్తాఫా (27) చిన్న విషయంలో గొడవపడగా వీరిపై న్యూసెన్స్ కేసు నమోదు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా 9 రోజుల జైలు శిక్ష విధించారు.

పరామర్శ


కేసీఆర్‌ను పరామర్శిస్తున్న డిప్యూటీ మేయర్

లాలాపేట: యశోదా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సీఎం కేసీఆర్‌ను బుధవారం జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డి పరామర్శించారు. త్వరగా కేసీఆర్ కోలుకుని ప్రజల్లోకి రావాలని ఆకాంక్షించారు.

ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరగాలి


మాట్లాడుతున్న చక్రధర్‌యాదవ్, సదాశివయాదవ్

సనత్‌నగర్: ప్రజాస్వామ్యయుతంగా జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలను నిర్వహించాలని ఆ కాలనీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు యల్లావుల చక్రధర్‌యాదవ్, కాలనీ నివాసి, మాజీ కార్పొరేటర్ కంజర్ల సదాశివయాదవ్, గంగాధర్‌గుప్తా, ఉదయ్‌రాజ్ మాట్లాడారు. కాలనీలోని ప్రతి అపార్ట్‌మెంట్ నుంచి ఆయా అపార్ట్‌మెంట్‌వాసులు ఒకరిని ఈసీ మెంబర్‌గా ఎన్నుకోవడం జరుగుతుందని, అలా ఎన్నుకున్న ఈసీ మెంబర్లు ఫెడరేషన్ అధ్యక్షుడు, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. అయితే గత కొన్ని పర్యాయాలుగా ఈసీ మెంబర్లతో సంబంధం లేకుండా అప్రజస్వామికంగా రహస్య సమావేశాలను నిర్వహించుకుని వారికి నచ్చిన వారితో ఫెడరేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ నెల 17న ఫెడరేషన్ ఎన్నికలు జరగాల్సి ఉందని, అయితే ఎన్నికలు జరగకుండా ఈ సారి కూడా అప్రజాస్వామికంగా ఫెడరేషన్‌ను ఏర్పాటుచేసే కుట్ర జరుగుతుందన్నారు. ఇప్పటికే అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత నివాస గృహాల నుంచి ఎన్నికైన ఈసీ సభ్యులను పక్కనబెట్టి ఏకపక్షంగా ఫెడరేషన్ ఎన్నిక చేయాలని చూస్తే తాము కోర్టును ఆశ్రయిస్తామన్నారు.

శుభాకాంక్షలు


సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించిన తీగుళ్ల పద్మారావుగౌడ్‌కు బుధవారం పలువురు పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. సీతాఫల్‌మండి శ్రీనివాసనగర్ నవరాలబస్తీకి చెందిన బీఆర్ఎస్ నాయకుడు పొగర్తి భువన్‌రావు పద్మారావును కలిసి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. -చిలకలగూడ

బాస్కెట్ బాల్ క్రీడాకారులకు సన్మానం


సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో క్రీడాకారులను సత్కరిస్తున్న దృశ్యం

అడ్డగుట్ట: దక్షిణ మధ్య రైల్వే బాస్కెట్ బాల్ క్రీడాకారులను సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రెజ్లింగ్ స్టార్స్ బాస్కెట్‌బాల్ అకాడమీ క్రీడాకారులు, కోచ్‌లు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ నెల 10న లూధియానా పంజాబ్‌లో జరిగిన 73వ సీనియర్ జాతీయ బాస్కెల్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో దక్షిణ మధ్య రైల్వేస్ నుంచి మెన్ ఇండియాన్ రైల్వేస్ బాస్కెట్‌బాల్ టీమ్, భారత రైల్వే మహిళా క్రీడాకారుల జట్లు పాల్గొన్నాయి. కేరళ మహిళా జట్ల ఫైనల్లో భారత రైల్వే మహిళా బాస్కెట్‌బాల్ క్రీడాకారులు విజయం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. అలాగే మెన్ ఇండియన్ రైల్వేస్ బాస్కెట్ బాల్ జట్టు తమిళనాడు జట్టుతో తలపడి రజత పతకాన్ని సొంతం చేసుకుంది. బుధవారం రైలులో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న మెన్ ఇండియన్ రైల్వేస్ బాస్కెట్ బాల్ టీమ్ చీఫ్ కోచ్ విశాల్ కుమార్, సౌత్ సెంట్రల్ రైల్వే ఆటగాళ్లు సంతోష్, మణి, రైల్వే మహిళా బాస్కెట్ బాల్ క్రీడాకారులు పుష్ప, గులాబ్షా, హర్షిత, ప్రియాంకను క్రీడాకారులు, కోచ్‌లు సన్మానించారు.

పనుల్లో నాణ్యత పాటించాలి


పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండులో నిర్మిస్తున్న వార్డు కార్యాలయ భవన నిర్మాణ పనులను బుధవారం స్థానిక కార్పొరేటర్ సామల హేమతో కలిసి జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. సుమారు రూ. 2 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వార్డు కార్యాలయ భవన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. త్వరలోనే నిర్మాణపనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ ఆశాలత, డీఈ సువర్ణ, ఏఈ కౌశిక్ పాల్గొన్నారు.

- చిలకలగూడ కిందిబస్తీలో రూ. 18 లక్షల వ్యయంతో సివరేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టామని కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. నిర్మాణ పనులను బుధవారం ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని, ప్రజా సమస్యలను తన దృష్టికి తెస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కరాటే రాజు, సాయి యాదవ్, మస్తాన్, సురానీ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం



సనత్‌నగర్: నిపుణులైన అధ్యాపకులచే ఉన్నతస్థాయి మేనేజ్‌మెంట్ విద్యను అందించడమే బద్రుకా ఎడ్యుకేషనల్ సొసైటీ లక్ష్యమని ఆ సంస్థ గౌరవ సెక్రటరీ శ్రీకిషన్ బద్రుకా స్పష్టం చేశారు. బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో బుధవారం బద్రుకా స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (బీఎస్‌ఎం) ప్రారంభ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా బీఎస్‌ఎం డీన్ డాక్టర్ ప్రభు అగర్వాల్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలో నాణ్యమైన మేనేజ్‌మెంట్ విద్యను విద్యార్థుల పరం చేసే దిశగా బీఎస్‌ఎం సేవలందించనున్నదన్నారు. 73 ఏళ్ల బద్రుకా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లాలో 14 ఎకరాల విస్తీర్ణంలో బీఎస్‌ఎంను నెలకొల్పడం జరిగిందన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) టాప్ 25 ర్యాంకింగ్స్‌లో దక్షిణాది నుంచి నాలుగు మేనేజ్‌మెంట్ సంస్థలు ఉంటే ఆ స్థానాల్లో తెలుగు రాష్ట్రాలు లేకపోవడం విచారకరమన్నారు. ఆ లోటును భర్తీ చేసేందుకు బీఎస్‌ఎం ప్రయత్నిస్తుందన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన


రోడ్డు పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్

లాలాపేట: తార్నాక డివిజన్ హనుమాన్‌నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అధికారులు అందుబాటులో ఉంటూ పనులు జరుగుతున్న తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కార్యాచరణ


సమావేశంలో పాల్గొన్న సభ్యులు

చిలకలగూడ : రైల్వే రక్షకదళ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని అసోషియేషన్ ప్రతినిధులు తెలిపారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని, అందుకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించామన్నారు. ఆర్‌పీఎఫ్‌పీడబ్ల్యుయూఏ ప్రెసిడెంట్ వరప్రసాద్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మధుసూదనరావు ప్రతినిధులు వీరన్న, కేవీపీ నాయర్, జీవీఎస్ రాయుడు, ముత్యాలు పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన


పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్: డివిజన్‌లోని ఏఆర్‌కే. నగర్‌లో జరుగుతున్న నాలా పూడికతీత పనులను కార్పొరేటర్ కంది శైలజ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నాలాలలో చెత్తా చెదారం వేయకుండా చూసుకోవాలని స్థానికులకు సూచించారు. ఎప్పటికప్పుడు సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, తద్వారా వాటిని త్వరగా పరిష్కరించే వీలుంటుందన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు శ్రీనివాస్, జలసాయి, రఘు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న డాక్టర్ వేదరణ్య

అడ్డగుట్ట: లాలాగూడ కేంద్రీయ రైల్వే ఆస్పత్రిలో బుధవారం ఆస్తమా వైద్య శిబిరం నిర్వహించారు. ఆస్తమా వ్యాధితో బాధపడుతున్న, వ్యాధి లక్షణాలున్న 60 మందికి ఊపిరితిత్తుల పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, మాత్రలు పంపిణీ చేశారు. పల్మనాలజిస్ట్ డాక్టర్ వేదరణ్య మాట్లాడుతూ.. కోవిడ్ అనంతరం ఊపిరితిత్తుల సమస్యలు అధికమయ్యాయని అందువల్ల ప్రజలందరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

14 ఏళ్లుగా అయ్యప్ప భక్తులకు నిత్యాన్నదానం



రసూల్‌పురా: శబరిమల అయ్యప్ప స్వామి దీక్ష నియమనిష్ఠలతో చేయాల్సి ఉంటుంది. మాలధారణ చేసిన స్వాములు పూజతో పాటు బిక్షను కూడా పవిత్రంగా స్వీకరిస్తారు. అయ్యప్పలు ఎక్కడపడితే అక్కడ బిక్షను స్వీకరించరాదు. ఈ నేపథ్యంలోనే అయ్యప్ప స్వాముల కోసం కంటోన్మెంట్ బోర్డు మూడవ వార్డులోని అన్నానగర్ అయ్యప్ప సేవా సమాజం గత 14 ఏళ్లుగా మండలం (41) రోజుల పాటు నిత్యాన్నదానం చేస్తున్నారు. అన్నానగర్ చౌరస్తాలో ఉన్న వీరాంజనేయ స్వామి ఆలయంలోని అయ్యప్ప సన్నిధానంలో జరిగే నిత్యాన్నదానంలో రోజూ దాదాపుగా 500 మంది అయ్యప్ప స్వాములు బిక్షను స్వీకరిస్తారు.

- 34 ఏళ్ల క్రితం మొట్టమొదటిసారి ఈ అయ్యప్ప స్వాముల దీక్ష అన్నానగర్‌లో నలుగురితో ప్రారంభమైంది. మద్దేల యాదగిరి, సుంకన్న, వెంకటేష్, నర్సింగ్ అనే నలుగురు స్వాములు మాలధారణ చేసి అన్నానగర్‌లో అయ్యప్ప సన్నిధానం ఏర్పాటు చేశారు. ప్రతియేటా మాలధారణ చేసే స్వాములు పెరుగుతుండడంతో 14 ఏళ్ల క్రితం స్థానికంగా ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలో తడికెలతో సన్నిధానం ఏర్పాటు చేసి స్వాములకు ఆశ్రయమిస్తూ అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. అయితే.. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదాకేశవరెడ్డి అయ్యప్ప స్వాముల కోసం ఏడేళ్ల క్రితం శాశ్వతంగా షెడ్డు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ సన్నిధానంలో 50 మంది అయ్యప్ప స్వాములు ఉంటూ నిత్య పూజలు చేస్తున్నారు.
- ప్రతియేడు అయ్యప్ప స్వాములు పెరుగుతుండడం, అల్పాహారం, బిక్ష కోసం ఇబ్బంది పడుతుండడంతో సన్నిధానం ఏర్పాటు చేసిన రోజు నుంచే 41 రోజుల పాటు నిత్యాన్నదానం ప్రారంభిస్తున్నారు. అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిరాటంకంగా కొనసాగుతున్న ఈ నిత్యాన్నదాన కార్యక్రమంలో బిక్షను స్వీకరించేందుకు నగరంలోని స్వాములే కాక క రీంనగర్, వరంగల్, నిజామాబాద్, సిద్ది పేట, హుస్నాబాద్, జనగాం ప్రాంతాల నుంచి ఉద్యోగస్తులు, వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగించే స్వాము లు ఇక్కడ బిక్షను స్వీకరిస్తున్నారు.